బొడ్రాయిబజార్ : డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం, వైద్య ఆరోగ్య సిబ్బంది

డెంగీని సమాజం నుంచి తరిమికొట్టాలి

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం

బొడ్రాయిబజార్, మే 16 : డెంగీ వ్యాధిని సమాజం నుంచి తరిమికొట్టాలని, డెంగ్యూ వ్యాధికి కారణమయ్యే ఎడిస్ దోమ వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ఏఎన్‌ఎంలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎడిస్ దోమ పగటిపూట కుడుతుందని, అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం, తల నొప్పి, కండరాల నొప్పి వస్తుందన్నారు. వ్యాధి సోకిన వారిని దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వాక్సినేషన్ అధికారి డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ నాజియ, కీటక జనిత వ్యాధుల నివారణ విభాగం డెమో అంజయ్య, ఏఎంఓ మోతీలాల్, శాబుద్దీన్, నర్సయ్య, శ్రీనివాస్‌రాజు, కడారి రమేశ్ పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ డే అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, డాక్టర్ వందన, సీహెచ్‌ఓ బిచ్చునాయక్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చివ్వెంల : డెంగ్యూ నివారణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ భవాని అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ యాదగిరి, సూపర్ వైజర్ శిరోమణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోతె : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మోతె ఆధ్వర్యంలో జాతీయ డెంగీ నివారణ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, సూపర్‌వైజర్ కమలమ్మ, ఆరోగ్య సిబ్బంది నాగమణి, శ్రీదేవి, జ్యోతి, విజయశ్రీ, పద్మ పాల్గొన్నారు.

చిలుకూరు : చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో

డాక్టర్లు సుశీల, ప్రియాంక, సూపర్‌వైజర్ సావిత్రి, సీహెచ్‌ఓ వినోద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, సుదర్శన్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న రజాక్

అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి

● బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్

మద్దిరాల, మే 16 : సన్న రకం వడ్లకు మాత్రమే కాకుండా దొడ్డు రకం వడ్లకు కూడా క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్ అన్నారు. గురువారం పార్టీ మండల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు చెప్పినట్టుగా వడ్లలో రకాలు చూడకుండా ప్రతీ క్వింటాకు రూ.500 బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతు భరోసా కింద ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఎలాంటి షరతులు లేకుండా రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. ఈ నెల 19న తిరుమలగిరిలో నిర్వహించే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఓటు కలిగిన బీఆర్‌ఎస్ పార్టీ సానుభూతిపరులు రావాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, జిల్లా నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదన్, దామెర్ల వెంకన్న, లావుడ్య వెంకన్న, సూరారపు రాజు, ఏలేటి మల్లారెడ్డి, భూసాని ఉమామహేశ్వర్, తిరుమల్‌రావు, మల్లాల నర్సయ్య పాల్గొన్నారు.

రేబల్లెలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

చింతలపాలెం, మే 16 : మండలంలోని రేబల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఏఈ బల్లూరి దుర్గయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాతంగి ప్రభాకర్, కోటా స్టాలిన్, బుచ్చారావు, నరసింహారావు, అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు బ్రహ్మం, వెంకటేశ్వర్లు, బాబురావు, ఆదాం, గోవింద్, సురేశ్, రామస్వామి, వెంకటేశ్వర్లు, పుల్లారావు, గురవయ్య, నాగరాజు, సైదులు, యాకోబు, నాగరత్నం, వెంకయ్య, నాగభూషణం, కాటయ్య, అంజి పాల్గొన్నారు.


విగ్రహావిష్కరణలో పాల్గొన్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ

రెస్టారెంట్‌లో చోరీకి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్

మఠంపల్లి, మే 16 : ఈ నెల 9న మండల కేంద్రంలోని ఓ రెస్టారెంట్‌లో జరిగిన నగదు చోరీ కేసులో పోలీసులు గురువారం నిందితుడిని అరెస్ట్ చేశారు. ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. సన్స్ రెస్టారెంట్‌లో దేశబోయిన సంధ్య క్యాషియర్‌గా పని చేస్తున్నది. ఆమెకు చెందిన రూ.2 లక్షల నగదును రెస్టారెంట్‌లోని కౌంటర్‌లో పెట్టి తాళం వేసి ఇంటికి వెళ్లింది. కాగా మిర్యాలగూడెం పట్టణం సీతారాంపురానికి చెందిన బానోతు సైదులు (24) అర్ధరాత్రి సమయంలో రెస్టారెంట్ షెట్టర్ పగులగొట్టి లోపలికి ప్రవేశించి కౌంటర్‌లోని రూ.2 లక్షల నగదును అపహరించుకుపోయాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి మట్టపల్లి గ్రామ వై జంక్షన్ వద్ద నిందితుడి పట్టుకున్నారు. కొట్టేసిన నగదులో రూ.16 వేలు ఖర్చు కాగా రూ.1,84,000ను రికవరీ చేశారు. సైదులుపై వివిధ పోలీస్ స్టేషన్లలో 22 కేసులు ఉన్నాయి. మూడేండ్లు చర్లపల్లి జైలులో ఉండి ఏడు నెలల క్రితం విడుదలైనట్లు ఎస్ఐ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రామాంజనేయులు

మట్టపల్లి గోశాలకు వరిగడ్డి అందజేత

గరిడేపల్లి, మే 16 : మట్టపల్లి లక్ష్మీనర్సింహస్వామి గోశాలకు మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన కోడి మల్లయ్య, నందిపాటి మధు ట్రాక్టర్ ట్రక్కు వరిగడ్డిని గురువారం అందజేశారు. కార్యక్రమంలో కటకం వేణు, సత్యనారాయణరెడ్డి, ఆవుల నాగయ్య, నక్క మట్టయ్య, శ్రీను, సైదులు, సుధాకర్, వెంకన్న పాల్గొన్నారు.

దిర్శించర్ల ఊర చెరువు కబ్జా

- ● శిఖం భూమిని ఆక్రమిస్తున్న పలువురు రైతులు
- ● హద్దులు లేకపోవడంతోనే ఆక్రమణ
- ● పరిరక్షించాలని గ్రామస్తుల వేడుకోలు

దిర్శించర్ల ఊరచెరువు శిఖం భూమిని మట్టిపోసి ఆక్రమించుకుంటున్న రైతులు

నేరేడుచర్ల, మే 16 : కాకతీయులు, రెడ్డి రాజుల కాలంలో తీసిన చెరువులు, కుంటలకు పూర్వ వైభవంను తీసుకురావడం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి మిషన్ కాకతీయ పనులు చేపట్టింది. కాని కొంతమంది గుత్తేదారులు వాటికి హద్దులు నిర్ణయించకుండానే నామమాత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. దాంతో చెరువు చుట్టుపక్కల రైతులు చెరువు శిఖంను ఆక్రమించుకోవడం పరిపాటిగా మారింది. మండలంలోని దిర్శించర్ల గ్రామంలోని సర్వే నంబర్ 52లోని ఊర చెరువు కబ్జాకు గురవుతున్నది. ఎన్నో ఏండ్లుగా చెరువును ఆనుకుని సాగు చేసుకుంటున్న కొంతమంది రైతులు చెరువు శిఖం భూమిని ప్రతి ఏటా కొద్ది కొద్దిగా ఆక్రమించుకుంటున్నా సంబంధిత అధికారులు మాత్రం ఆవైపు కన్నెత్తి కూడా చూడటం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ యేడాది చెరువులో చుక్క నీరు లేకుండా ఎండిపోయింది. ఇదే అదునుగా కొంతమంది రైతులు పెద్ద ఎత్తున ఆక్రమణలకు పాల్పడ్డారు. చెరువు సమీపంలోని రైతు ఏకంగా చెర్వులోనే మట్టి ఎత్తుకుని శిఖం భూమిని చదును చేశాడు. ఊర చెరువు మొత్తం 111.26 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నది. 150 ఎకరాలకు పైగా సాగు నీరందిస్తుంది. కాని ప్రస్తుతం దానిలో మూడోవంతు మేరకు ఆక్రమణకు గురైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువును పునరుద్ధరించడం కోసం గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద రూ.33 లక్షలు మంజూరు చేసింది. అయితే గుత్తేదారులు ఆక్రమణకు గురైన చెరువు శిఖం భూముల జోలికి వెళ్లకుండా మిగిలిన చెరువులోనే పూడికతీత పనులు చేపట్టారు. దాంతో రైతులు చెరువు భూమిని ఆక్రమించుకోవడానికి అవకాశం దక్కింది. ఈ ఒక్క ఊర చెరువే కాదు ఇదేవిధంగా మండలంలోని అనేక చెరువులు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని బహిరంగంగా విమర్శలు వినిపిస్తున్నాయి. తక్షణమే రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంగా దృష్టి సారించి ఆక్రమణలకు గురైన చెరువు శిఖాలను గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలి

చెరువు శిఖం భూములకు హద్దులు లేకపోవడంతో చెరువు చుట్టూ ఉన్న రైతులు ప్రతి ఏటా చెరువులో నీళ్లు లేని సమయంలో వాటిని ఆక్రమించుకుంటున్నారు. ఉపాధి కూలీల చేత చెరువులో పూడికతీత పనులు చేపడుతున్నారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో చెరువు హద్దులు నిర్ణయించి వాటికి ఉపాధి సిబ్బంది చేత హద్దులను ఏర్పాటు చేయిస్తే బాగుటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేశా

దిర్శించర్ల ఊర చెరువు మట్టిని అక్రమంగా తరలించుకుపోవడంతో పాటు కొంతమంది రైతులు చెరువు శిఖం భూమిని ఆక్రమించుకుని మట్టిపోసి లెవల్ చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా రైతులు ఆగకుండా ఆక్రమించుకుంటున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని చెరువు శిఖం భూమిని కాపాడాలి.

– నాగరాజు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్, దిర్శించర్ల

సర్వే చేయిస్తాం

మండలంలోని చెరువులు ఆక్రమణకు గురవుతున్నట్లు దృష్టికి వచ్చింది. చెరువు శిఖం ఆక్రమించుకున్న వారికి నోటీసులు జారీ చేస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చెరువు శిఖం భూములను సర్వే చేయిస్తాం. ఏవరైనా ఆక్రమించుకున్నారని నిర్ధారణ అయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– సైదులు, తాసీల్దార్, నేరేడుచర్ల

ఆక్రమణదారులపై కేసులు నమోదు చేస్తాం

దిర్శించర్ల గ్రామంలోని ఊర చెరువుకి ఇరువైపులా ఉన్న రైతులు చెరువు శిఖంను ఆక్రమించుకున్నారని కొంతమంది గ్రామ రైతులు ఇచ్చిన సమాచారం మేరకు వెళ్లి పరిశీలించగా ఆక్రమణకు గురైనట్లు గుర్తించాం. రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి చెరువు చుట్టూ హద్దులు ఏర్పాటు చేస్తాం. ఎవరైనా వాటిని తొలగిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– అమరేందర్‌రెడ్డి, నీటి పారుదల శాఖ డీఈ, నేరేడుచర్ల

మారోజు వీరన్న ఆశయ సాధనకు పాటుపడాలి

● నాయకులు

నేరేడుచర్ల : నేరేడుచర్లలో మారోజు వీరన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

బొడ్రాయిబజార్, మే 16 : దళిత బహుజన విప్లవోద్యమ నాయకుడు, కులవర్గ జమిలి పోరాట సిద్ధాంతకర్త మారోజు వీరన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్ట్ పార్టీ రెవల్యూషన్ ఆఫ్ మారోజు ఆర్గనైజింగ్ సెక్రటరీ చామకూరి నర్సయ్య, సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ రాష్ట్ర నాయకుడు బుద్ధ సత్యనారాయణ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. మారోజు వీరన్న 25వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. భారతదేశ విప్లవ రాజకీయాల్లో దశ దిశ నిర్దేశించి మార్గం చూపించిన వ్యక్తి వీరన్న అని కొనియాడారు. కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ లింగంపల్లి భద్రయ్య, నాయకులు కరీం, న్యాయవాది వీరన్న, నల్లగుంట్ల అయోధ్య, వీరన్న సోదరి దేవకమ్మ, సామాజిక తెలంగాణ మహాసభ నాయకులు దడిపల్లి వెంకట్, జానిమియా, శ్రీనివాస్, డాక్టర్ కరుణాకర్, వెంకన్న పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారం వీరన్న లక్ష్యం

తుంగతుర్తి : భారతదేశ విప్లవోద్యమానికి నూతన పంథాను సూచించిన విప్లవ యోధుడు కామ్రేడ్ మారోజు వీరన్న అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని కర్విరాల కొత్తగూడెం స్టేజీ వద్ద సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టిపల్లి మల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మారోజు వీరన్న వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని వీరన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గిరగాని భిక్షపతిగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిరికొండ రామకృష్ణ, నాయకుడు మట్టపెల్లి మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మారోజు వీరన్న వర్ధంతిని స్థానిక సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, వాస పల్లయ్య, కొత్తపల్లి రేణుక, అఖిల్‌కుమార్, హుస్సేన్, వాస కరుణాకర్, సురం రేణుక, లక్ష్మి, పావని, శ్యామల, సత్తమ్మ, నాగమ్మ, సుమలత, ఫాతిమా పాల్గొన్నారు.

అర్వపల్లి : మారోజు వీరన్న వర్ధంతిని మండల కేంద్రంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో చామకూరి నర్సయ్య, ఈదురు వీరపాపయ్య, దడిపెల్లి వెంకట్, లింగంపల్లి విజయ్, మారయ్య, రామచంద్రయ్య, లక్ష్మణ్‌నాయక్, నాగరాజు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి కృత్రిమ కాలు అందజేత

నేరేడుచర్ల, మే 16 : నేరేడుచర్ల పట్టణానికి చెందిన దివ్యాంగుడు వేపచేదుల సైదులుకు గురువారం అదే పట్టణానికి చెందిన పోరెడ్డి స్వరాజ్యలక్ష్మి ఆమె భర్త సత్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం రూ.2 లక్షల విలువ గల కృత్రిమ కాలును కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు సైదులు కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో ఇంజమూరి శ్రీకాంత్, పున్నయ్య, గోపి పాల్గొన్నారు.

రైస్ మిల్లు నిర్మాణాన్ని నిలిపివేయాలని వినతి

చిలుకూరు, మే 16 : పాత చిలుకూరులో ఇండ్ల మధ్యలో నిర్మిస్తున్న రైస్ మిల్లు పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ చుట్టుపక్కల గ్రామస్తులు పలువురు గురువారం తాసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీఓ గిరిబాబుకు వినతిపత్రం అందజేశారు. రైస్ మిల్లు నుంచి వచ్చే దుమ్ము, దూళి, పొగ, పొట్టు వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలెబోయిన వెంకటి, యరగాని సైదులు, మేకపోతుల శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

● సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు నాగయ్య

నూతనకల్, మే 16 : ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల సమస్యలను పరిశీలించి మాట్లాడారు. పని ప్రదేశంలో టెంట్లు వేయించాలని, మంచినీరు సౌకర్యం, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బానాల వెంకట్‌రెడ్డి, చిర్ర రాములు, బానాల లింగారెడ్డి, యానాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలు సరికాదు

● బీఆర్‌ఎస్ నాయకుడు రవినాయక్

పాలకవీడు, మే 16 : కాంగ్రెస్ ప్రభుత్వం అనురిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు సరికాదు అని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి భూక్యా రవినాయక్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. పలు జిల్లాలో ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అకాల వర్షాలతో, తడిసిన ధాన్యంతో రైతులు వీధిన పడుతుంటే మరోవైపు ప్రభుత్వం రైతులను పట్టించుకోకుండా రాజకీయాలు చేస్తుందని దుయ్యబట్టారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ప్రతి గింజనూ కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తీర్చాలని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

తిరుమలగిరి, మే 16 : మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన చెవిటి శాంతికుమార్ ఇటీవలి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయి దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. గురువారం అతడి బాల్య స్నేహితులు కలిసి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని శాంతికుమార్ తల్లికి అందజేశారు. కార్యక్రమంలో దయాయాదవ్, వల్లపు శోభన్‌బాబు, నాయిని నరేశ్, కుంభం చరణ్, బోయిని ఎల్లేశ్ పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణ చర్యలపై అవగాహన

● మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి

నూతనకల్, మే 16 : ప్రతి ఒక్కరూ వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి వడదెబ్బపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వడదెబ్బ తగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, అనుముల రవీందర్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయంగా పని చేయాలి

● అదనపు కలెక్టర్ ప్రియాంక

పెన్‌పహాడ్‌లో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

పెన్‌పహాడ్, మే 16 : ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సిబ్బంది పని చేయాలని అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. గురువారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సీతారాంపురంలో గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న శానిటేషన్ పనులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. వర్షాలు పడుతున్నందున సిబ్బంది శానిటేషన్‌ను మెరుగుపరుచాలని సూచించారు. అనంతరం ముత్యాలమ్మ చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. టెంట్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉన్నాయా లేదా పరిశీలించారు. కూలీల వేతనాలు సకాలంలో వారి అకౌంట్స్‌లోకి వస్తున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కూలీలకు సంబంధించి మస్టర్లు పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ మధుసూధన్‌రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ నరేశ్, ఏపీఓ రవి, ఈసీ మహేశ్, టీఏ ఏకస్వామి, కార్యదర్శి శివకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ కవిత పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి : డీపీఓ సురేశ్‌కుమార్

గ్రామాల్లో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు మెరుగుపరుచాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం, పెన్‌పహాడ్ గ్రామాల్లో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ పారిశుధ్య పనులను తనిఖీ చేసి మాట్లాడారు. మురుగు కాల్వల్లో పూడికతీత, బ్లీచింగ్ చల్లడం, మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీటిని అందించాలన్నారు. ఎంపీఓ నరేశ్, పంచాయతీ కార్యదర్శులు శివ, అఖిల్ పాల్గొన్నారు.

21 నుంచి మట్టపల్లి నృసింహుడి తిరు కల్యాణం

మఠంపల్లి, మే 16 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవాన్ని ఈ నెల 21నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. 21న విశ్వక్సేన పూజ, రుత్విగ్వరణం, రక్షాభందనం, అఖండ దీపారాధన, అంకురారోపణ, ధ్వజారోహణం, 22న శ్రీధ్రువ స్వామి వారికి పంచామృతాభిషేకం, ద్రవిడ ప్రబంధ సేవాకాలం, మల్లికా పుష్ప సహస్ర నామార్చన, లక్ష మల్లికా పుష్ప పూజ, ఎదుర్కోలు మహోత్సవం, రాత్రి 12 గంటలకు స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం, 23న గరుడ వాహన సేవ, వేద పఠనం, హరికథ, 24న రాజ్యలక్ష్మి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, శ్రీ సూక్త సహిత మహాలక్ష్మి యాగం, 25న వసంత సేవ, అస్త్ర హోమం, పూర్ణాహుతి, దోపు ఉత్సవం, 26న పుష్పయాగం, ద్వాదశ సేవలు, డోలోత్సవం, పవళింపు సేవను అర్చకులచే శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

● తాసీల్దార్ ఆంజనేయులు

మునగాల, మే 16 : ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు తాసీల్దార్ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 2,028 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. వారిలో 1,402 మంది పురుషులు, 626 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఓటర్ జాబితా తాసీల్దార్ కార్యాలయం నోటీస్ బోర్డు నందు ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు.

నేరేడుచర్లలో ఎమ్మెల్సీ ఓటర్లు 2,290

నేరేడుచర్ల : ఈ నెల 27న జరుగనున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నేరేడుచర్ల మండలం, పట్టణంలో 2,290 మంది ఓటు హక్కుదారులు ఉన్నట్లు తాసీల్దార్ సైదులు తెలిపారు. మొత్తం ఓటర్లలో 1,491 మంది పురుషులు, 799 మంది మహిళా ఓట్లు నమోదు అయినట్లు చెప్పారు. వీరు ఓటు హక్కును వినియోగించుకోవడానికి పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు

సాదాసీదాగా మేళ్లచెర్వు మండల సర్వసభ్య సమావేశం

మేళ్లచెర్వు, మే 16 : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొట్టె పద్మా సైదేశ్వర్‌రావు అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో కొత్త నిర్ణయాలు తీసుకోలేదు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో జడ్పీటీసీ శాగం రెడ్డి పద్మాగోవిందరెడ్డి, ఎంపీడీఓ ఖాజా అజ్గర్ అలీ, వైస్ ఎంపీపీ గాయం గోపిరెడ్డి, పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదలను మోసం చేసిన బీజేపీ

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు చంద్రశేఖర్

హుజూర్‌నగర్, మే 16 : దేశంలోని పేదలను బీజేపీ మోసం చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేండ్ల ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడి పోయిందన్నారు. యువతకు 5 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మొండి చేయి చూపిందన్నారు. కార్యక్రమంలో నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, పోకల వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సతీశ్ చార్యులుకు పురోహిత రత్న బిరుదును అందజేస్తున్న మదన్‌మోహన్ ఆచార్యులు

దండు మైసమ్మ ఆలయ పూజారికి విశ్వ పురోహిత రత్న బిరుదు

ఆత్మకూర్.ఎస్, మే 16 : మండల పరిధిలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయ పూజారి అబ్బోజు సతీశ్‌చార్యులకు తెలంగాణ విశ్వకర్మ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వ పురోహిత రత్న బిరుదును ప్రదానం చేశారు. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన సమావేశంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్‌చార్యులు, విశ్వ జ్యోతిర్లింగ పీఠాధిపతి రామడుగు నర్సింహాచార్యులు ఈ బిరుదును ప్రదానం చేశారు.